సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 18 । జూలై । 2025

సింగరేణిలో ఆర్టీఐకి అడ్డంకులు

శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులకు అడ్డంకి ఏర్పడింది. అధికారులు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్-2005) దరఖాస్తులు స్వీకరించడం లేదు.

8లో ▸



ముంచెత్తిన వరద

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. రోడ్లను వరద ముంచెత్తడంతో గంటలపాటు జనజీవనం స్తంభించింది.

9లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలా చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంబీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంబీసీడీసీ) ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ యువకులకు హైదరాబాద్‌లో నైపుణ్య అభివృద్ధికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన 21 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం(36 కులాలు మాత్రమే), ఆదాయ ధ్రువీకరణ పత్రం(గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5లక్షల లోపు, పట్టణప్రాంతాల్లో రూ.2లక్షల లోపు) ఉండాలన్నారు. జూలై 22లోగా https://tgobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకుని, ధ్రువపత్రాలు జతపర్చి బీసీ అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి(ఆసిఫాబాద్): ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఏఎస్పీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవన శైలిని పాటించాలని సూచించారు. గంజాయి మొక్కలు పెంచడం, సరఫరా చేయడం, విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్, ఎంఈవో ఆడే ప్రకాశ్, హెచ్‌ఎం పంచపుల తదితరులు పాల్గొన్నారు.

కోడి గుడ్ల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు అగ్‌మార్క్ నియమాల ప్రకారం కోడిగుడ్ల సరఫరాకు ఆసక్తి గల పౌల్ట్రీ ఫారం నిర్వాహకుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు, ఈఎండీ(టెండర్ విలువపై 1శాతం)ను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, ఆసిఫాబాద్ పేరిట డీడీ తీసి https://tender.telangana.gov.inలో దాఖలు చేయాలని సూచించారు. సంబంధిత పత్రాలు, ఈఎండీ నిర్ణీత గడువులోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 99668 53227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 21న ఉదయం 11.30 గంటలకు ఆన్‌లైన్‌లో బిడ్ డాక్యుమెంట్ అందుబాటులో ఉంటుందని, ఈ నెల 19న ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్‌లో ప్రీబిడ్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 5న బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, 6న జిల్లా షెడ్యూల్ కులాల అధికారి కార్యాలయంలో హార్డ్ కాపీలు సమర్పించాలన్నారు. 8వ తేదీన ఉదయం 11.30 గంటలకు బిడ్లు తెరుస్తామని ఆయన తెలిపారు.

'ఇంచు జాగా వదిలిపెట్టం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని 14 గ్రామాలు విలీనం చేసుకుంటామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఖండిస్తున్నామని, ఇంచు జాగా కూడా వదిలిపెట్టమని కెరమెరి మండల బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. సుప్రీం కోర్టులో సరిహద్దు గ్రామాలపై కేసు కొనసాగుతుండగా మహారాష్ట్ర సీఎం, రెవెన్యూ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, పార్టీ మండల అధ్యక్షుడు అంబాజీ, నాయకులు యూనుస్, రూప్‌లాల్, రాజయ్య, జగన్నాథ్‌రావు, జాహెద్ పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించగా.. పట్టణ ప్రజలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు న్యూ కాలనీలో రోడ్డుకిరువైపులా పేరుకుపోయిన చెత్త తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాపువాడలోని భట్టుపల్లి చౌరస్తా వద్ద మురుగునీరు నిలిచిపోవడంతో చెత్త తొలగించి నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. విజయబస్తీలో పబ్లిక్ టాయిలెట్స్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించి చదును చేయించారు. నిజాముద్దీన్ కాలనీలో కొంతకాలంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ ద్వారా డంప్ యార్డుకు తరలించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంపై ఆయా కాలనీల ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూకాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది



విజయ బస్తీలో పిచ్చిమొక్కలు తొలగించి చదును చేస్తున్న సిబ్బంది



నిజాముద్దీన్‌కాలనీలో చెత్త తొలగించి ట్రాక్టర్‌లో వేస్తున్న సిబ్బంది



హౌరా పట్టాలెక్కేనా..?

- కలకత్తాకు బెంగాలీలు, వ్యాపారుల రాకపోకలు
- కాగజ్‌నగర్ మీదుగా ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని విన్నపం
- ప్రతిపాదనలకే పరిమితమైన వైనం



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ మీదుగా పశ్చిమ బెంగాల్‌కు హౌరా ఎక్స్‌ప్రెస్ నడిపించాలనే కల నెరవేరడం లేదు. కాజీపేట్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా మహానగరమైన కలకత్తాకు నేరుగా రైలు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పిస్తున్నా బుట్టదాఖలే అవుతున్నాయి. ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని బసంత్‌నగర్, రామకృష్ణాపూర్, నజ్రూల్‌నగర్, రవీంద్రనగర్, సిర్పూర్(టి)తోపాటు మహారాష్ట్రలోని బల్లార్షా తదితర ప్రాంతాల్లో బెంగాలీలు అధిక సంఖ్యలో స్థిరనివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా నిత్యం వ్యాపార నిమిత్తం కలకత్తాకు తరచూ వెళ్తుంటారు.

వ్యాపార నిమిత్తం

పారిశ్రామిక ప్రాంతమైన పశ్చిమ బెంగాల్ ప్రధాన రాజధాని కలకత్తాకు వాణిజ్య అవసరాల కోసం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. నగరంలో దుస్తులు, తదితర వస్తువుల తయారీ కేంద్రాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. వీరి సౌకర్యార్థం రైలు లేకపోవడంతో వీరంతా కాజీపేటకు వెళ్లి అక్కడి నుంచి వరంగల్, విజయవాడ మీదుగా సుదీర్ఘ ప్రయాణం చేస్తున్నారు. అదే కాజీపేట నుంచి కాగజ్‌నగర్ మీదుగా వెళ్తే తక్కువ దూరంతోపాటు సమయం, ఖర్చు ఆదా అవుతాయి. గతంలో కాగజ్‌నగర్ నుంచి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక బోగీ ఉండేది. అది కాజీపేట వరకు వెళ్లి అక్కడి నుంచి లింక్ ఎక్స్‌ప్రెస్‌కు కలుపుకుని వయా వరంగల్ మీదుగా ఒక బోగీ హౌరాకు వెళ్లేది. కానీ కొన్ని కారణాలతో దానిని రద్దు చేశారు.

కేంద్ర మంత్రులు సహకరిస్తేనే..

కాగజ్‌నగర్ మీదుగా హౌరా వరకు రైలు నడిపించేందుకు కేంద్ర మంత్రులు సహకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావు, ప్రస్తుత సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కలకత్తాకు రైలు నడపాలని పలుమార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదు. అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు చేసినప్పటికీ రైల్వే అధికారులు స్పందించక పోవడంతో ఈ మార్గం గుండా రైలు నడిపిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రయాణ ప్రయాస..

ప్రయాణికులు ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లాలంటే కలకత్తా వరకు సుమారు రెండు వేల కిలోమీటర్లు దూరం ప్రయాణించాలి. వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. కాగజ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్ల నుంచి సికింద్రాబాద్ లేదా, కాజీపేటకు వెళ్లి అక్కడి నుంచి వెళ్లాలి. ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్(12704), ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్(18045), వయా నల్గొండ, సికింద్రాబాద్ - షాలీమార్(కోల్‌కత్తా) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22850), వయా వరంగల్ మీదుగా వెళ్తున్నాయి. హౌరా రైలు ప్రారంభమైతే బసంత్‌నగర్, కాగజ్‌నగర్‌లోని బెంగాలీ క్యాంప్, బల్లార్షాలోని బెంగాలీ క్యాంప్‌లలో సుమారు 52వేల మంది బెంగాలీలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

మూడో లైన్ పూర్తయ్యాక..



తెలంగాణ నుంచి ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లేందుకు కాజీపేట, రామగుండం, కాగజ్‌నగర్ మీదుగా బల్లార్షా వయా గోందియా మీదుగా హౌరాకు రైలు నడిపించాలని పలుమార్లు కేంద్ర రైల్వే మంత్రులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించాం. మూడో లైన్ పనులు పూర్తయ్యాక ప్రారంభిస్తామని తెలిపారు. ఈ రైలు ప్రారంభమైతే తెలంగాణలోని బెంగాలీ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

కేంద్ర మంత్రులు చొరవ చూపాలి



కాగజ్‌నగర్ మండలంలో 32 వేల మంది బెంగాలీలు స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. వ్యాపార అవసరాల నిమిత్తం కలకత్తాకు వెళ్తుంటారు. కాగజ్‌నగర్ మీదుగా కలకత్తాకు రైలు నడిపితే వారితోపాటు స్థానిక వ్యాపారులకు ఉపయోగకరంగా ఉంటుంది. కేంద్ర మంత్రులు చొరవ తీసుకుంటేనే ఈ మార్గం గుండా రైలు నడిచే అవకాశం ఉంది.

– ప్రయాగ్ తివారి, రైల్వే యాత్రి సమితి అధ్యక్షుడు

ఇబ్బందులు పడుతున్నాం



కాగజ్‌నగర్ నుంచి కలకత్తాకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. కాగజ్‌నగర్ మీదుగా చర్లపల్లి హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతిపాదనలు ఉన్నా సంబంధిత అధికారులు, మంత్రులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతవాసులకు రాకపోకలకు దూరభారం అవుతోంది.

– కౌశిక్ భట్టాచార్య, కాగజ్‌నగర్

పోషకాహారలోపం గుర్తింపునకు సర్వే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: పోషకాహార లోపం కలిగిన పిల్లలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో వైద్యారోగ్య, శిశు సంక్షేమ శాఖ అధికారులు సంయుక్త సర్వే చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల తన చాంబర్‌లో డీఎంహెచ్‌వో సీతారాం, యూనిసెఫ్ ప్రతినిధులతో జిల్లాలో పోషకాహార లోపం కలిగిన పిల్లల నిష్పత్తిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సకాలంలో సరైన ఆహారం, మందులు అందించి పోషకాహార లోపాన్ని నియంత్రించాలన్నారు. యూనిసెఫ్ బృందం సహకారంతో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో యూనిసెఫ్ పోషకాహార నిపుణురాలు డాక్టర్ ఖ్యాతి తివారి, న్యూట్రిషియన్ ఆఫీసర్ రేష, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లలో వసతులు కల్పించాలి

కాగజ్‌నగర్‌టౌన్: నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లలో పూర్తిస్థాయి వసతులు కల్పించి, లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి గురువారం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోరిగాం శివారులో 12 బ్లాక్‌ల్లో 228 డబుల్ బెడ్రూంలు నిర్మించామన్నారు. విద్యుత్, తాగునీరు, కిటికీలు, తలుపులు, అంతర్గత రహదారుల నిర్మాణాలు, పెయింటింగ్ తదితర పెండింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ హౌజింగ్ పీడీ వేణుగోపాల్, తహసీల్దార్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పథకం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పథకం అమలు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరాన్ని జిల్లా సంక్షేమ అధికారి అడెపు భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సహాయ ఉపకరణాల పథకం కింద అర్హులకు పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. దివ్యాంగుల అర్హత పరిశీలన పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పలువురు దివ్యాంగులు అదనపు కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకురాగా.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. సమావేశంలో వైద్యులు, సంక్షేమ శాఖ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతిగృహంలో ఆశ్రమ పాఠశాలల వంట సిబ్బందికి గురువారం ఒకరోజు వృత్త్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీటీడీవో మాట్లాడుతూ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. నిర్ణీత సమయంలో విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కాలం చెల్లిన సామగ్రిని వంటకు వినియోగించొద్దని, వర్షాకాలం దృష్ట్యా నిత్యం ఆహార పదార్థాలను పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవోలు చిరంజీవి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

- జీవో 49 వ్యతిరేక పోరాట కమిటీ నాయకుల పిలుపు



ఐక్యత చాటుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఆదివాసీలు, ప్రజలను గ్రామాల నుంచి దూరం చేసే జీవో నంబర్ 49 రద్దుకు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని జీవో నం. 49 వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన నాయకులు లాల్‌కుమార్, సోయం చిన్నయ్య, ఎండీ చాంద్‌పాషా మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన, గిరిజనేతర ప్రజలకు భద్రత లేదన్నారు. పశువులను మేపడానికి అడవుల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దని ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని, వంట చెరుకు కోసం వెళ్లనీయడం లేదని ఆరోపించారు. పులుల సంరక్షణ పేరుతో ప్రజల జీవనాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజల ఆమోదం లేనందున జీవో 49 రద్దు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ నెల 21న చేపట్టే బంద్ జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 28న కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, భారత్ బచావో ఆందోళన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఇన్నయ్య, బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొండయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ్ అబ్రహం తోపాటు ప్రజా, ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో యువత, ప్రజలకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదక ద్రవ్యాల ప్రభావాన్ని అరికట్టడం, యువతను సానుకూల దిశగా ప్రోత్సహించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గత నెల నుంచి ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతీ సోమ, గురువారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే సమస్యలు, కుటుంబాలపై దుష్ప్రభావాలు, తదితర విషయాలు వివరిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి పంట పండించినా, మాదక ద్రవ్యాలు సేవించినా, సరఫరా చేసినా డయల్ 100, 1098, 87126 70551 నంబర్లకు సమాచారాన్ని అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

దొంగల బెడద

- బెంబేలెత్తిస్తున్న వరుస చోరీలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా రెచ్చిపోతున్న వైనం
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న ఘటనలు



కౌటాలలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

కౌటాల(సిర్పూర్): చోరీలు జిల్లా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు జిల్లావాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆలయాలు, ఇళ్లే లక్ష్యంగా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. పగలు రెక్కీ నిర్వహిస్తూ తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తూ రాత్రిపూట తాళాలు పగులగొట్టి సొత్తు ఎత్తుకెళ్తున్నారు.

మహారాష్ట్రకు జంప్..!

జిల్లాలోని సగం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. అలాగే కాగజ్‌నగర్, రెబ్బెన, సిర్పూర్(టి)లో రైల్వేస్టేషన్లతోపాటు రోడ్డు మార్గాలు కూడా ఉన్నాయి. దీంతో పొరుగురాష్ట్రం నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. చింతలమానెపల్లి, కౌటాలలో మంగళవారం జరిగిన దొంగతనంలోనూ మహారాష్ట్రకు చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. స్థానిక నేరస్తులు చోరీలకు పాల్పడినా.. సరిహద్దు దాటి వెళ్లి పోలీసుల నుంచి తప్పించుకుంటున్నారు.

జాగ్రత్తలు అవసరం

ఏటా జిల్లాలో దొంగతనాలు జరుగుతున్నాయి. 2023లో 104 దొంగతనాలు జరగగా, 2024లో 78 చోరీలు జరిగినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. రూ.లక్షల్లో నగదు, విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రికవరీ మాత్రం అంతంతే ఉంటోంది. చోరీ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

- కుటుంబ సభ్యులందరూ ఊరికి వెళ్తే విలువైన ఆభరణాలు వెంట తీసుకెళ్లాలి. లేదా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవడం మేలు.
- ఇంట్లో ఎక్కువ మొత్తంలో నగదు ఉంచుకోవద్దు.
- ఇరుగుపొరుగు వారితోపాటు పోలీసులకు సమాచారం అందిస్తే రాత్రిపూట పెట్రోలింగ్ చేసే అవకాశం ఉంటుంది.
- అనుమానితులు కాలనీల్లో కనబడితే పోలీసులకు సమాచారం అందించాలి.
- కొందరు సామగ్రి విక్రయిస్తున్నట్లు కాలనీల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తారు. అనుమానాస్పదంగా తిరిగే చిరువ్యాపారుల పైనా ఓ కన్ను వేసి ఉంచాలి.
- ముఖ్యంగా ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

ఇటీవలి ఘటనలు

- కౌటాల మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎడ్ల తిరుపతి ఇంట్లో ఈ నెల 15న రాత్రి దొంగతనం జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కరీంనగర్ వెళ్లిన ఆయన.. తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తుల కదలికలు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేశారు. వారు గోడ దూకి పరారయ్యారు. ఈ ఘటనలో రూ.7వేలు ఎత్తుకెళ్లారు.
- చింతలమానెపల్లి మండలం డబ్బా ఎక్స్ రోడ్డులోని మహేశ్‌గౌడ్ ఫర్టిలైజర్ షాపులో ఈ నెల 15న రాత్రి దొంగలు పడి రూ.50 వేల వరకు నగదు దోచుకెళ్లారు. షాపులోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు.
- మే 30న కాగజ్‌నగర్ ఓల్డ్ కాలనీలో దొంగలు పడి నగదు అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- కాగజ్‌నగర్ పట్టణంలో రాత్రి సమయంలో పార్కింగ్ చేసిన నాలుగు లారీల బ్యాటరీలను జూన్ 18న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.
- కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న త్రినేత్ర శివాలయంలో జూన్ 10న రాత్రి గుర్తుతెలియని చొరబడ్డారు. గర్భగుడి తాళం పగలగొట్టి శివలింగం పై ఉన్న వెండి నాగపడగ అపహరించారు.

సింగరేణిలో ఆర్టీఐకి అడ్డంకులు

- సమాచార అధికారుల నియామకంలో జాప్యం
- నిలిచిన దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులకు అడ్డంకి ఏర్పడింది. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో అధికారులు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్ -2005) దరఖాస్తులు స్వీకరించడం లేదు. మూడు నెలలుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో సమాచారం కోరే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా పరిధిలో ఈ చట్టం కింద దరఖాస్తులు స్వీకరించాల్సిన పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐవో), అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఏపీఐవో) లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. పీఐవోగా బాధ్యతలు స్వీకరించిన ఓ డీజీఎం అధికారి ఏప్రిల్ 15న అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ఆతర్వాత ఏపీఐవోగా బాధ్యతలు నిర్వహించిన అధికారి కూడా గత నెల ఇక్కడి నుంచి ఇతర ఏరియాకు బదిలీ అయ్యాడు. ఆ స్థానాన్ని కూడా భర్తీ చేయలేదు. దీంతో ఈ రెండు సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. పీఐవో బాధ్యతలు నిర్వహించే అధికారి మృతి చెందిన తరువాత మరో పూర్తిస్థాయి అధికారిని నియమించే వరకు ఏపీఐవోకు ఇన్‌చార్జి పీఐవో బాధ్యతలు అప్పగించడానికి అనుమతి కోరుతూ ఏరియా అధికారులు కార్పొరేట్ అధికారులకు లేఖ రాశారు. వారు ఆలస్యంగా స్పందించడంతో ఆలోపే సదరు ఏపీఐవో అధికారి కూడా ఇక్కడి నుంచి వేరే ఏరియాకు బదిలీ అయ్యారు. దీంతో ఈ రెండు బాధ్యతలను చూసేవారు కరువయ్యారు.


శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం

వెనుదిరిగి పోతున్న దరఖాస్తుదారులు

సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడానికి జీఎం కార్యాలయానికి వచ్చిన కార్మికులు, సమాచార చట్టం కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు అక్కడ అధికారులెవ్వరూ దరఖాస్తులు స్వీకరించకపోవడంతో వెనుదిరిగి పోతున్నారు. ఆ స్థానాల్లో అధికారులు వచ్చేంత వరకు తమకు ఈ దరఖాస్తులు స్వీకరించే అధికారం లేదని ఇతర అధికారులు వారికి చెప్పి తిప్పి పంపిస్తున్నారు. దీనికి తోడు ఇది వరకే పీఐవోకు దరఖాస్తు చేసుకున్నాక సరైన సమాచారం, స్పందన లేకపోవడంతో అప్పిలేట్ అధికారిగా ఉన్న ఏరియా జీఎంకు దరఖాస్తులు చేసుకున్న వారూ ఉన్నారు. ఆ దరఖాస్తులపై కూడా నిర్ణయం తీసుకోవాలంటే కూడా పీఐవో వద్ద సమాచారం తీసుకోవాల్సి ఉంటుంది. పీఐవో లేకపోవడంతో అప్పిలేట్ దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోకుండా మరుగునపడ్డాయి. కార్పొరేట్ అధికారుల జాప్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలిసింది. చట్టబద్ధత గల ఇలాంటి పోస్టుల భర్తీలో జాప్యం చేయడం సరికాదని, ఇలా చట్టాలను నీరుగార్చుతున్నారని దరఖాస్తు దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం పరిరక్షణ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్‌కు లేఖ రాశాం..

పీఐవో, ఏపీఐవో పోస్టులు భర్తీ చేయడం కోసం కార్పొరేట్ అధికారులకు లేఖ రాశాం. కార్పొరేట్ అధికారుల ఆదేశాల మేరకే ఈ నియామకాలు జరుగుతాయి. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– ఎం.శ్రీనివాస్, జీఎం, శ్రీరాంపూర్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ షురూ

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ శివారులోని కొండాపూర్ వద్ద ఉన్న నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో గురువారం రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి 180మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. గురువారం క్వాలిఫై పోటీలు నిర్వహించగా.. శుక్రవారం నుంచి ఈ నెల 20వరకు ప్రధాన పోటీలు కొనసాగుతాయి. అండర్–19 బాలురు, బాలికలు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్, వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్‌గౌడ్, మహేష్, ప్రణీత్, నందకుమార్ పోటీలను పర్యవేక్షించనున్నారు. శుక్రవారం మెయిన్ డ్రా పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు.


బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

మద్యానికి బానిసై ఒకరు బలవన్మరణం

ఖానాపూర్: మద్యానికి బానిసై ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వీవీరావుపేటకు చెందిన మండ్ల శ్రీనివాస్ గల్ఫ్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రజిత, కుమార్తెలు శ్రీనిధి, శ్రీహిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన ఆరుగురి అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఒకరి ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన గుండ సునీత, భూమయ్య ఉపాధి నిమిత్తం హాజీపూర్‌లో నివాసం ఉంటున్నారు. ముల్కల్లలోని సమీప బంధువులు సునీత తమను ఆర్థికంగా మోసం చేసిందని మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు. భూమయ్య ఫిర్యాదు సుద్దాల రాజేశ్వరి, సుద్దాల సుమన్, దామెర జయకుమార్, దామెర సురేందర్, సుద్దాల మౌనిక, దండు వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సర్తాజ్‌పాషా తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన లెండుగూరి భీంరావు (55)భార్య విమల ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో తన పత్తి చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు అశ్విక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బోథ్ కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన తబస్సు ఖానమ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్ష తీసుకున్నారని పేర్కొన్నారు. అనంత సొల్యూషన్ ఔట్‌సోర్సింగ్ ద్వారా గతేడాది ప్రభుత్వ పాఠశాల బాలక్ మందిర్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. ఏడు నెలల పాటు ఉద్యోగం చేయగా, కేవలం ఒక నెలకు సంబంధించి రూ.16వేల వేతనం చెల్లించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆరు నెలల వేతనం ఇవ్వకపోవడంతో విధులు మానేసినట్లు తెలిపారు. ఈ విషయమై తనను మోసం చేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డయల్ 100 సేవలు దుర్వినియోగపర్చిన ఒకరిపై..

నిర్మల్: అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన డయల్ 100 సేవలను మద్యం మత్తులో దుర్వినియోగపరిచిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సర్సాపూర్ (జి) మండల కేంద్రంలో బుధవారం రాత్రి కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ, మోహన్ పెట్రో కార్ విధులు నిర్వహిస్తుండగా మండల కేంద్రానికి చెందిన తక్కల మహేష్ మద్యం మత్తులో డయల్ 100కు పలుమార్లు ఫోన్ చేసి న్యూసెన్స్ చేశాడు. దీంతో మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కడెం: మండలంలోని కొండుకూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని నవబ్‌పేట్‌కు చెందిన జక్కుల శ్రీనివాస్ బైక్‌పై కడెం నుంచి నవాబ్‌పేట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో కొండుకూర్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సారంగపల్లిలో చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లిలో ఆసంపల్లి స్వామి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు స్వామి పది రోజులక్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చిచూడగా తాళం తీసి ఉంది. వెంటనే లోనికి వెళ్లి బీరువాను తెరిచి చూడగా అందులో దాచి ఉంచిన రూ.22 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన బాధితుడు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

క్లుప్తంగా

108లో సుఖప్రసవం


శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారం గ్రామానికి చెందిన గర్భిణి రెడ్డి లవలోకకు పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అర్జున్న 108కి సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది అంబులెన్సులో కోటపల్లి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో పంగిడిసోమారం అటవీప్రాంతంలోనే సుఖప్రసవం చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇరువురిని కోటపల్లి పీహెచ్‌సీకి తరలించారు. కార్యక్రమంలో ఈఎంటీ షబనాజ్, పైలట్ ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాణిసతీజీ కాలనీలో ఉన్న ఐఎఫ్‌సీ ఫుడ్‌కోర్టులో ఈనెల 15న రాత్రి జరిగిన చోరీలో నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. దుకాణంలోంచి రూ.వెయ్యి నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని షాపు యజమాని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

సిమ్స్‌లో సింగరేణికి 7 సీట్లు

శ్రీరాంపూర్: రామగుండంలోని సిమ్స్ (సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో కంపెనీ కోటా కింద 7 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉద్యోగులు, అధికారుల పిల్లలకు ఈ సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ఆశ్రమ ప్రాథమిక పాఠశాలల్లో సీఆర్‌టీ(ఎస్‌జీటీ)ల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 18 నుంచి 23లోగా గిరిజన సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. స్థానిక గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, డీఈడీ పాసై, టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు. ఈ నెల 25న అర్హత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్ట్


బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్: అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బేల మండలానికి చెందిన సుమిత్, అతని మిత్రుడైన సలీం షకిల్‌తో కలసి మహారాష్ట్రకు చెందిన కృష్ణతో గ్యాంగ్‌గా ఏర్పడ్డారన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్, బేల, మహారాష్ట్ర కోర్పణ మండలాల్లో బైక్‌లను అపహరించి ఇతరులకు విక్రయిస్తుండేవారన్నారు. వారి వద్దనుంచి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. కోటపల్లి మండలంలోని రాంపూర్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. డ్రైవర్ సంజయ్‌ను అదుపులోకి తీసుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించమన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రెండోలీగ్‌లో ఓడిన ఉమ్మడి జిల్లా జట్టు


సాయికుమార్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎ స్టార్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రెండో లీగ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సాయి సత్య టీంతో 90 ఓవర్ల చాంపియన్‌షిప్‌లో ఓడిపోయింది. ఆదిలాబాద్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 30.3 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్ చేసిన సాయిసత్య టీం 24.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసి విజయం సాధించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులోని సాయికుమార్ 7 వికెట్లు సాధించడం గమనార్హం. పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలంగా ఉండడంతో, ఇరు జట్లు పరుగులను చేసేందుకు ఇబ్బంది పడ్డాయని కోచ్ ప్రదీప్ తెలిపారు.

దివ్యాంగులకు రైలులో రాయితీపై ప్రయాణం


మాట్లాడుతున్న ఐఎస్‌ఆర్ మూర్తి

మంచిర్యాలఅర్బన్: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి రైల్వేశాఖ రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందని సికింద్రాబాద్ డివిజన్ (ఎస్‌సీఆర్) అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్‌ఆర్ మూర్తి అన్నారు. గురువారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించారు. మంచిర్యాల కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

నిర్మల్‌టౌన్: షట్టర్ లిఫ్టింగ్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన రాజుసింగ్ మోహన్‌సింగ్, సేవక్ సింగ్ రఘుబీర్‌సింగ్, సుర్దిప్ సింగ్ ముగ్గురు బంధువులు. నిర్మల్ జిల్లాలో కూలి పనులు చేసేవారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న రాత్రి బైక్‌పై లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ చేరుకుని పెట్రోల్ బంక్ సమీపంలోని ఇంటి ముందున్న బైక్‌ను దొంగలించారు. అనంతరం ఓ గోల్డ్‌షాప్‌లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. అదే రాత్రి ఉమ్రికి వెళ్తూ మార్గమధ్యలో కుంటాల మండలం కల్లూరు బస్టాండు సమీపంలో రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి రూ.2,500ల నగదు అపహరించారు. గురువారం నిర్మల్‌లో బంగారం విక్రయించడానికి వచ్చారన్న పక్కా సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.7 కిలోల వెండి, 17 గ్రాముల బంగారం, రూ.2,500 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెండి ఆభరణాలను 'నిర్మల్ పోలీస్' అని అందంగా అలంకరించి, తప్పించుకోలేరని ఒక మెసేజ్ ఇచ్చారు. కేసును ఛేదించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, అశోక్, పీసీఆర్ ఎస్సై ప్రదీప్ కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ఇచ్చోడలో దొంగల బీభత్సం

- ఒకేరోజు మూడిళ్లలో చోరీ
- బంగారం, వెండి, నగదు అపహరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన జాదవ్ దేవిదాస్ మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి సొనాల మండలంలోని ఘన్‌పూర్‌కు వెళ్లారు. తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లో చొరబడి తులం బంగారం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదు దొంగిలించారు. విద్యానగర్ కాలనీలోని రమేశ్ ఇంట్లో చొరబడి 4 గ్రాముల బంగారంతో పాటు నగదు అపహరించారు. అదేకాలనీలో ఉన్న చిత్రం జంగు ఇంట్లో తులం బంగారం, ఐదు తులాల వెండి దొంగిలించారు. సంతోషిమాత ఆలయం వద్ద పార్క్ చేసిన పల్సర్ 220 బైక్‌ను తీసుకెళ్లి ఆదిలాబాద్ బైపాస్ వద్ద వదిలేసి పరారయ్యారు. అప్రమత్తమైన పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.


ఇంటి తాళం పగులకొట్టిన దృశ్యం

'ఉమ్మడి జిల్లా బంద్‌కు సహకరించాలి'

ఆదిలాబాద్: జీవో 49 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 21న చేపట్టనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు సహకరించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, ప్రజాస్వామ్యవాదులు, గ్రామ పటేళ్లు, రాయి సెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీ కుల సంఘాలు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు వెడ్మ బొజ్జు, ముకుందరావు, పీ. నాగోరావు, గెడం ఆనందరావు, దుర్వ జుగాదిరావు, ఆత్రం మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెట్టి మనోజ్

గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ఉట్నూర్‌రూరల్: కెరమెరి మండలంలోని నిషాని గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఆత్రం వంశీకృష్ణ పైచదువుల నిమిత్తం గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌లో అపజయాలు ఉండవని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

సన్మానం

కళామందిర్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల సేవారత్న పురస్కారం అందుకున్న కాత్లే మారుతిని గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సన్మానించారు. ఆదిలాబాద్ మండలం చించుఘాట్ గ్రామానికి చెందిన మారుతి ఎంతోమంది గిరిజన విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఫౌండేషన్ తరపున అతనికి రూ.లక్ష నగదు, జ్ఞాపిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏసీఎంవో జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పాల్గొన్నారు.


ల్యాప్‌టాప్ అందజేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

చెరువులో పడి బాలుడు మృతి


అశ్విత్ (ఫైల్)

దిలావర్‌పూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కొప్పుల అశ్విత్ (15) బుధవారం సాయంత్రం ఆడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం మండల కేంద్రంలోని కుడి చెరువులో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలకృత్యాల కోసం వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందినట్లు అశ్విత్ తల్లి కొప్పుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. మండలంలోని వానల్‌పాడ్‌కు చెందిన సిద్దివార్ రమణ (45) పట్టణంలోని కోర్వగల్లిలో నివాసముంటున్నాడు. కుమారుడు రాజుతో కలిసి ఉదయం స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో కిడ్నాప్ కలకలం


నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో బాలుడి కిడ్నాప్‌కు యత్నం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన ఐదేళ్ల బాలుడికి తండ్రి కిరాణా కొట్టువద్ద బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చి ఇంటికి వెళ్లమని చెప్పాడు. అదే గ్రామానికి వెంట్రుకలు కొనుగోలు చేయడానికి ఆటోలో వచ్చిన ఆరుగురు మహిళలు బాలున్ని ఆటోలో ఎక్కించుకుని వెళ్లారు. బాలుడు ఇంటికి రాకపోయేసరికి కంగారుపడిన తల్లిదండ్రులు అనుమానంతో బంగల్ పేట్ మహాలక్ష్మి వద్ద ఉన్న తెలిసిన వారికి ఫోన్ చేసి విషయం తెలిపారు. అప్పటికే ఆ మహిళలు మహాలక్ష్మి కాలనీకి కొద్ది దూరంలో బాలుడిని దించి వెళ్తుండగా పట్టుకుని నిలదీశారు. తమకేం తెలియదని బుకాయించడంతో వారిపై దాడి చేశారు. అనంతరం మహిళలను పోలీసులకు అప్పగించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం


ఆస్పత్రి ఎదుట క్షతగాత్రులు

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లిలో గురువారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. అల్లాడి అనసూర్య ఎడమచేయి మణికట్టు వద్ద, ఆలం సాంబయ్య కాళ్లకు, చెన్నూరి బక్కు తల వద్ద, శనిగారపు పోశం కాళ్లకు, తలండి శ్రీనివాస్ చేతులను కొరికింది. చెన్నూరి శేఖర్‌పై పడి కొరికేందుకు ప్రయత్నించగా కర్రతో కొట్టి చంపాడు. జిల్లెడలో కూడా మరో నలుగురిపై దాడి చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. క్షతగాత్రులను ఆటో సాయంతో వేమనపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

కుక్క దాడిలో ఇరువురికి గాయాలు


గాయపడిన మహిళ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కాపువాడకు చెందిన కర్ల కళావతిపై కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరి మేయడంతో ప్రాణాపాయం తప్పింది. రైల్వే స్టేషన్‌కు వెళ్లే మరో ప్రయాణికునిపై కూడా కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే స్టేషన్‌లో కుక్కల బెడద ఉందని 'సాక్షి' బుధవారమే కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారులు స్పందించక పోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే స్టేషన్ పరిసరాల్లో కుక్కల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.